క్లుప్తంగా

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



జయంతి(వీరులపాడు):మండలంలోని జయంతి గ్రామంలో వేంచేసియున్న షిరిడీ సాయిబాబా ఆలయ ఐదవ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఎంపీపీ కోటేరు లక్ష్మీ స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీని సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దైవ సేవకులు ఐక్యంగా ఉండాలి



శివాపురం(పెనుగంచిప్రోలు): దైవ సేవకులు ఐక్యంగా ఉండాలని నేషనల్ క్రిస్టియన్ బోర్డు (ఎన్‌సీబీ) రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఏజీసీఎం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ప్రభుకుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా బోర్డు మండల ప్రతినిధుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ సేవకులు దేశ రక్షణ కోసం ప్రార్థించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ ఎ.చింతయ్య మాట్లాడుతూ బోర్డు సభ్యులు, ప్రతినిధులు అందరూ కష్టపడి పనిచేసి క్రీస్తు ప్రేమను అందరికీ పంచాలన్నారు. ఎన్‌సీబీ రాష్ట్ర కార్యదర్శి మార్క్, ట్రెజరర్ శేఖర్, సభ్యులు పీటర్, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కొణకంచి(పెనుగంచిప్రోలు):పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి వాణి తెలిపారు. గురువారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో మంచి పోషక విలువలు ఉన్న ఆహారం అందిస్తుందన్నారు. మంచి ఆరోగ్యంతోనే మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. సర్పంచ్ గోసెల దేవి, హెచ్ఎం జ్యోతి, వైద్య సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

అల్లూరు(వీరులపాడు):ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య తెలిపారు. మండలంలోని అల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ మెను ప్రకారం విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, మాజీ సర్పంచ్ కోటేరు సూర్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు మోంద్రు బాయమ్మ, వార్డు సభ్యుడు రాజగోపాల్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కర్ల లింగయ్య భవనం ప్రారంభం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కర్ల లింగయ్య కళాభవన్ (సీపీఐ) భవనాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ప్రారంభించారు. అనంతరం మునేరు అవతల స్నేహ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జెల్లి విల్సన్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనెపూడి శంకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, స్థానిక నాయకులు వల్లంకొండ బ్రహ్మం, పొన్నం నరసింహారావు, ఇంటూరి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం

జగ్గయ్యపేట అర్బన్:ముక్త్యాల గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థికి విమలాభాను ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. బి.కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ విమలాభాను విద్యార్థి బి.రాజేష్‌కు పరీక్ష ఫీజు నిమిత్తం రూ.5 వేలు అందించారు.

ప్రకృతి వ్యవసాయంతో పంటలు

- 11 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతు వీరభద్రరావు
- ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందిస్తున్న వైనం
- కారం, పసుపు విదేశాలకు తీసుకెళ్తున్న వినియోగదారులు
- తెగుళ్లు, దోమ తట్టుకునేందుకు అంతర పంటల సాగు



అంతర పంటలో మిర్చి సాగు చేసిన రైతు వీరభద్రరావు



సేంద్రియ విధానంలో సాగు చేసిన నువ్వుల పంట



భద్రరావు తయారు చేస్తున్న బెల్లం దిమ్మెలు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):నేడు ప్రపంచమంతా ప్రకృతి వ్యవసాయం గురించే మాట్లాడుతున్నారు. ఎరువులు, పురుగు మందులతో పండించిన పంటల ఉత్పత్తులతో మానవుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని పరిశోధనల్లో వెల్లడవుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయం ప్రత్యామ్నాయంగా మారింది.

మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన వూట్ల వీరభద్రరావు తనకున్న 8 ఎకరాల పొలంలో వివిధ పంటలను 11 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయంతో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. సాగుకు ముందు ఘనామృతం, విత్తనశుద్ధికి బీజామృతం, సాగులో జీవామృతం వేసి పూర్తిగా సేంద్రియ వ్యవసాయం సాగిస్తున్నాడు. వరి, పసుపు, చెరకు, మిర్చి సాగు చేస్తున్నాడు. ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొని మెలకువలు తెలుసుకున్న వీరభద్రరావు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు ఆరంభించి నెమ్మదిగా బొప్పాయి, అరటి, మిర్చి, పసుపు, వరి, చెరుకు పంటలను పండిస్తున్నాడు. రాష్ట్రంలో ఎక్కడ సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శనలు జరిగినా తన ఉత్పత్తులను అక్కడ విక్రయిస్తాడు.

అంతర పంటలతో లాభాలు....

ఈ ఏడాది తన మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేసిన వీరభద్రరావు ఆరు సాళ్లకు ఒక సాలు జొన్న, సజ్జ, ఉల్లి, కంది, అక్కడక్కడ వేరుశనగ, ఉల్లి అంతర పంటలుగా సాగు చేశాడు. ముఖ్యంగా జొన్న, సజ్జ వలన పైముడత, తెల్లదోమ పూర్తిగా నిరోధించటంతో పాటు నల్లి వలన కెమికల్ వాడిన పొలాలు 100 శాతం నాశనమయినా తన మిర్చికి కేవలం 20 శాతం లోపే ప్రభావం చూపిందని, ఇదంతా సేంద్రీయ పద్ధతుల్లో, అంతర పంటల సాగుతో సాధ్యమయిందన్నారు. ఇప్పటికే నల్లి, ఇతర వైరస్‌లతో పక్కన పొలాల్లో కోతలు అయి పోయినా ఇంకా తన పొలంలో పచ్చి కాయలు కూడా ఉన్నాయన్నారు. ఎకరానికి 12 క్వింటాళ్ల పైన నాణ్యమైన దిగుబడి వచ్చిందన్నారు.

మార్కెట్‌లో మంచి డిమాండ్....

ప్రస్తుత మారుతున్న కాలంలో సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ బాగా పెరిగింది. సేంద్రియ పద్ధతిలో పండించిన కిలో మిరపకాయలు రూ.500 అమ్ముతుంటే కారం రోకళ్లతో కొట్టింది కిలో రూ.650 వరకు ధర పలుకుతుంది. పండ్లు కిలో రూ.200 వరకు అమ్ముతున్నారు. పసుపు కిలో రూ.250 పలుకుతుంది. బెల్లం కిలో రూ.120 ఉంది.

సేంద్రియ ఉత్పత్తులు సరఫరా చేస్తాం

ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యం కావాలని కోరుకుంటున్నారు. దీంతో కెమికల్ వాడని పదార్థాల కోసం ఆలోచిస్తున్నారు. గ్రామంలో కెమికల్‌తో పంటలు పండించే వారు కూడా నాదగ్గర కారం, పసుపు కొంటున్నారు. కాయలతో పాటు కారం, పసుపు కూడా రోకళ్లతో కొట్టిచ్చి ప్యాకెట్ల ద్వారా విక్రయిస్తున్నాం. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న స్టాళ్ల ద్వారా కూడా అమ్ముతున్నాం. చుట్టు పక్కల గ్రామాలు, మండలాలు, జిల్లాలు మాత్రమే కాకుండా హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, వైజాగ్ పట్టణాలకు కొరియర్, ట్రాన్స్‌పోర్టు, బస్సుల్లో కూడా కారం, కాయలు, పసుపు అందిస్తున్నాం. విదేశాల్లో ఉండేవారి కోసం కూడా ఇక్కడి నుంచి వారి కుటుంబ సభ్యులు, బంధువులు పంపిస్తున్నారు. రానురాను డిమాండ్ బాగా పెరుగుతుంది. సేంద్రియ సాగు గురించి ఎవరికైనా ఉచితంగా సలహాలు ఇస్తాం. అవసరమైన వారు 9989507283 ఫోన్ నంబర్లో సంప్రదించగలరు.

–వూట్ల వీరభద్రరావు

ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడండి



పనులు పర్యవేక్షిస్తున్న ఆర్డీ సత్యనారాయణ రావు, చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్:తాగునీటి సరఫరా, వీధి లైట్లు, పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణరావు తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులు గురువారం ఆయన పర్యవేక్షించారు. ఎర్రకాలువ ప్రక్షాళనకు పలు సలహాలు, సూచనలు అందించారు. పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు గురించి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర రీజనల్ డైరెక్టర్‌తో చర్చించారు. అలాగే వార్డు సచివాలయ సిబ్బంది పనితీరుపై, వారి విధి విధానాలపై సమీక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు పందుల రోశయ్య, తన్నీరు నాగేంద్రం, కాశి కిషోర్, మున్సిపల్ కమిషనర్ శివకోటేశ్వర రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ద్వారా పోషకాహారం



పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో సర్పంచ్, ఏసీడీపీవో తదితరులు

వత్సవాయి: రాష్ట్ర ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తుందని దాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏసీడీపీవో నాగమణి తెలిపారు. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 3 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. రాగులు, సజ్జలు, రాగులు, జొన్నలు, మినుములు, పెసలు వంటివి తరుచూ వాడుకోవాలని సూచించారు. మండలంలోని 80 కేంద్రాల్లో ఈ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్పంచ్ గుడేటి శారమ్మ, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్, శారద అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్:స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవ కారుడు భగత్‌సింగ్ 92 వ వర్ధంతిని పట్టణంలో గురువారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోదాడ రోడ్‌లోని నారాయణ స్కూల్ నుంచి మున్సిపల్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కూడలిలో భగత్‌సింగ్ చిత్ర పటానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర ఉద్యమంలో వీరోచితంగా పోరాడి తన ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప వీరుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. ఆయన త్యాగాన్ని భావితరాలు స్ఫూర్తిగా తీసుకొంటాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపినాయక్, ఐద్వా డివిజన్ కార్యదర్శి సోమోజు నాగమణి, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఎస్.ప్రణయతేజ, సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్, డీవైఎఫ్ఐ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట):స్వాతంత్య్ర సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతిని గ్రామంలోని అంజనాయూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్య్ర ఉద్యమంలో భగత్‌సింగ్ చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యూత్ సభ్యులు మల్లికార్జునరాజు, దాసు, ఏడు కొండలు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



షేర్‌మహ్మద్‌పేటలో భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

షేర్‌మహ్మద్‌పేటలో భగత్‌సింగ్ వర్ధంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రణయ్ తేజ, కృష్ణ, నాగమణి, లింగారావు, వెంకటేశ్వర్లు, రవి, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

నందిగామ:యువత భగత్ సింగ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజ పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నాడు బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్య్రం కోసం పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల పోరాట స్ఫూర్తితో నేటి యువత ముందుకు సాగాలని సూచించారు. చుండూరు వెంకట సుబ్బారావు, మన్నెం నారాయణరావు, కట్ట చామంతి, వేముల వీరయ్య, హనుమంతరావు, మౌలాలి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండికి సత్కారం



మల్లికార్జునరావును సత్కరిస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

మోగులూరు(కంచికచర్ల): మండలంలోని మోగులూరు గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది, కంచికచర్ల మండల పరిషత్ వైఎస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు ఇటీవల నందిగామలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గ్రామ సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. పలువురు సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లికార్జునరావు ఎన్నిక కావటం సంతోషకరమన్నారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ తనను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన రావు, ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.అరుణ్‌కుమార్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పేద వర్గాలకు న్యాయం జరిగేలా శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు బండి జానకిరామయ్య, మాజీ సర్పంచ్ షేక్ హుస్సేన్, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బండిపాలెంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

బండిపాలెం(జగ్గయ్యపేట):విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కేవీకే కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు గ్రామంలో క్యాంపు నిర్వహిస్తారన్నారు. బాపట్ల కళాశాల ఆర్గనైజర్ మురళీధర్, సర్పంచ్ ఎలిశమ్మ, కేవీకె శాస్త్రవేత్త వెంకట రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జగ్గయ్యపేటలో న్యాయవాదుల నిరసన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రతం అందజేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్:భవానీపురం సీఐ, ఏఎస్ఐపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని న్యాయవాదులు తెలిపారు. భవానీపురంలో న్యాయవాదిపై పోలీసులు అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని నిరశిస్తూ గురువారం జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కోర్టు వద్ద నుంచి రైతుబజారు వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిప్రతం సమర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ధనంజయుడు, సీనియర్ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ న్యాయవాదులపై పెట్టిన కేసులను తొలగించే వరకు తాము పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుందరరావు, సత్య శ్రీనివాసరావు, కార్యదర్శి దామాల సంతోష్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు వెంకట్రామయ్య, రాజేంద్రప్రసాద్, కాంతారావు, నరసింహారావు, గోనెల వెంకటేశ్వర్లు, కృష్ణంరాజు, దాసరి నాగేశ్వరరావు, ఆంజనేయులు, నాగరాజు, కృష్ణయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


బీసీ భవన్ అభివృద్ధికి కృషిచేయాలని వినతి



మున్సిపల్ ఆర్డీకి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘ నేతలు

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని బీసీ భవన్ అభివృద్ధికి కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణరావును కోరారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ఆర్డీని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూమాటి కృష్ణమాచారి, సంఘ నాయకుడు దేవరకొండ శ్రీను తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పలు సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కార దిశగా ఆలోచిస్తామని హామీ ఇచ్చారు.


రైల్వే కార్మికుల ఆరోగ్య భద్రతే ధ్యేయం




వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు సుమలత, రమ్య సుభాషిణీ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్య భద్రతే ధ్యేయమని స్థానిక రైల్వే వైద్యశాల డాక్టర్ సుమలత అన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో కార్మికులు, ఉద్యోగులకు ఆరోగ్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. డాక్టర్ సుమలతతో పాటు ఆంధ్ర వైద్యశాల పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్ర, జనరల్ ఫిజిషియన్ రమ్య సుభాషిణీ ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ వ్యాధి లక్షణాలు, చర్మవ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల నివారణకు మందుల వినియోగం, ఆహార నియమాలు వివరించారు. అనంతరం వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న



సోమవరం ప్రాంతంలో ఈదురు గాలులకు నేలకొరిగిన మొక్కజొన్న



మాగల్లులో పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నందిగామ: నందిగామ ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలి దుమారానికి మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. గత రెండు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు కేతవీరుని పాడు పరిసర ప్రాంతాల్లోని మొక్కజొన్న పంట నేలకొరిగింది. బుధవారం రాత్రి పెను గాలులకు మండలంలోని సోమవరం, రుద్రవరం, గోల్లమూడి ప్రాంతాల్లో మొక్కజొన్న నేలవాలింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం పై అంచనాలు వేస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఖాసిం తెలిపారు. అంచనాలలో భాగంగా గురువారం మండలంలోని రామిరెడ్డిపల్లి, కొండూరు, మాగల్లు ప్రాంతాల్లోని మొక్కజొన్న పొలాలను పరిశీలించామన్నారు. పంట దెబ్బతిన్న ప్రతి గ్రామానికి వెళ్లి పంట నష్టం పై అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు ఏవో తెలిపారు.

కచ్చితమైన కొలతలు, హద్దులతో రీ సర్వే

కంచికచర్ల: కచ్చితమైన కొలతలు, హద్దులతో భూములను రీ సర్వే చేసి హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి తెలిపారు. మండలంలోని పరిటాలలో గురువారం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా రీ సర్వేచేసిన ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో రైతుల సమక్షంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. రైతులందరూ సర్వే రాళ్లు పాతే సమయంలో తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్‌మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మి, వేముల ప్రదక్షిణరావు, వేల్పుల జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో భూముల రీ సర్వే

వీరులపాడు:గ్రామాల్లో భూముల రీసర్వేను నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. కార్యాలయంలో వీఆర్వోలతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పల్లంపల్లి, వీరులపాడు, వీఅన్నవరం గ్రామాల్లో శుక్రవారం నుంచి భూముల రీ సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీఆర్వోలు సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండటంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డెప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్, పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.